# మధ్యతరగతి కాంప్లెక్స్!

ఏమీ తోచడంలేదని ఫ్రెండింటికెళ్ళింది బబిత! "ఎప్పుడూ నేను రావడమేగాని నువ్వు రానేరావు" అని దెప్పుతూ వుంటుంది దీప్తి! అందుకని తీరిగ్గా రెండు గంటలు కూర్చుని కబుర్లు చెప్పుకుని రావాలి, మళ్లీ ఒక ఆర్నెల్లు అది నోరెత్తకుండా" అనుకుంటూ బయల్దేరింది బబిత. తండ్రి అనుమతి తీసుకుని, తనే కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లింది. దీప్తి ఇంటికి వెళ్లాలంటే ఎన్నో లెఫ్ట్ రైట్లు కొట్టాలి! అతుకుల బతుకుల్లాగా వుంటుంది, ఆ గతుకుల రోడ్డు. 'ఫుట్‌పాత్'ల మీద కూడా స్థలం వుండదు. అసలు ఆ సందులకి 'ఫుట్‌పాతే' ఉండదు. మున్సిపాలిటీవారు ఆసందుల్లోకి పొరపాటున కూడా కాలు పెట్టరేమోననిపిస్తుంది. చెత్తకుండీలు నిండిపోయి రోడ్డును సగం నింపేసిన చెత్త, గాలికెగురుతూ, వానకి తడుస్తూ ముక్కు బద్దలయ్యేలా దుర్వాసన విరజిమ్ముతూ వుంటుంది. మరి అక్కడ ప్రతి ఇంట్లోనూ గదికొక్కరు చొప్పున కాపురముంటారు. వారికి ఈ చెత్తగానీ ఈ దుర్వాసనగానీ ఏ మాత్రం అడ్డం వచ్చినట్లు కనబడదు. హాయిగా జీవితాల్ని గడిపేస్తూ వుంటారు, గంపెడు పిల్లలతో! రోడ్డంతా పిల్లలు ఆ మురికిని హాయిగా పీలుస్తూ ఆడుకుంటూ వుంటారు. ఈ మధ్య నీటి కరువు కూడా వచ్చిందేమో, బోరు పంపొకటి రోడ్డుకి మధ్యగా వేశారు. పంపుకొట్టే వాళ్లు కొంతమందీ, వరుసగా బిందెలు పట్టుకొని నిల్చునేవాళ్లు కొంతమందీ, రోడ్డుని ఆక్రమించుకుని నడవడానికే రోడ్డుమీద స్థలం లేకుండా వుంటుంది. అటువంటి చోటికి కారులో వెళ్లడం అంత మహా ఘోరమైన తప్పు ఇంకోటుండదు. తెలిసి తెలిసి కారులోనే బయలుదేరింది బబిత!

ఇల్లొక ఇరవై గజాల దూరం వుందనగా, కారు టైరు ఒకటి ఒక గుంతలో పడ్డట్టు మూతలేకుండా తెరిచిపెట్టిన డ్రైనైజ్ హోల్‌లో దిగబడిపోయింది. దాన్ని అందరూ వచ్చి వింతగా చూస్తున్నారు. కానీ ఒక్కరూ కాస్త ఆదుకుని, దాన్ని లేవనెత్తడానికి సాయం చెయ్యడం లేదు. చివరకు బబిత తనే స్టీరింగ్ ఒదిలిపెట్టొచ్చి, కారును లేపడానికి ప్రయత్నిస్తూవుంటే మెల్లిగా ఒకతనొచ్చి, ఒక చెయ్యివేశాడు. అతి కష్టంమీద కారు నడిపింది ఇంటిదాకా బబిత.

"ఏమిటే ఇలా వచ్చావ్! సర్‌ప్రైజ్! ఇవ్వాళేదో ప్రళయం రాకతప్పదు" అని జోక్‌చేస్తూనే బబిత మురికి చేతులని చూసి ఏమయిందే?' అంది. గతుక్కుమంటూ జరిగినదంతా చెప్పింది బబిత. 'మధ్యతరగతి కాంప్లెక్స్ చూడూ! సహాయం చెయ్యడానికి ఒక్కరు ముందుకు రాలేదు' అంది.

"వీళ్లంతేలే!" అని మామూలుగా అనేసి 'అవును బబితా! ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు, సుపీరియారిటీ కాంప్లెక్సు' అని విన్నాంగానీ ఈ మూడోరకం మధ్యతరగతి కాంప్లెక్సేమిటే?' అంది దీప్తి!

"చెప్తావిను! ఇలువంటి సంఘటన ఏ టాంకుబండుమీదో జరిగితే, కార్లల్లో పోతున్న ఎవరో ఒకరు దిగి సాయం చేసుండేవారు. లేదా ఏ గుడిసెల ముందో జరిగితే వాళ్లా బిలబిలమంటూ వచ్చి సాయం చేసుండేవారు. ఎందుకంటే ఆ ఇద్దరిలో ఎవరికీ ఏ భావాలూరావు. వాళ్లేమిటో వాళ్లకు తెలుసు. కానీ మధ్య తరగతి వాళ్లున్నారు చూశావ్! వాళ్లు, అలా ముందుకెళ్లి సాయంచెయ్యడం, బిలోడిగ్నిటీగా ఫీలవుతారు. వాళ్లకారు గుంటలోపడితే మనమేంచెయ్యాలి! మా స్కూటరు పడితే వాళ్ళొచ్చి తీస్తారా' అంటారు. అంతేకాదు. వీళ్ల మనస్తత్వం ఎలా వుంటుందంటే వాళ్లని వాళ్లు సూపర్‌గా ఊహించుకుంటూ వుంటారు. ఎవరో బరువుమోసుకొస్తున్నాడనుకోండి. వాడిమీద బాలిపడ్డా, ఎవర్నో పిలుస్తారు వాడి మీదున్న బరువు దింపడానికి పనిలోవున్న పనిమనిషి పరుగెత్తుకుంటూ వచ్చి దింపాలే తప్ప వాళ్లొక చెయ్యివెయ్యడం, చాలా తక్కువగా భావిస్తారు.

అలాగే భార్య అన్నా వాళ్లకి వాళ్లకన్నా ఒక మెట్టు తక్కువలో వున్నట్టే అనుకుంటారు. 'ఏమేవ్? వంటయిందా? ఏమేవ్? ఎంతసేపే ఏదో ఒకటి తగలెట్టు, టైమయిపోయింది వెళ్లిపోవాలి" అని సాధిస్తారే తప్ప పనితోటీ, పిల్లలతోటీ, అందరికీ అన్నీసర్ది సతమతమవుతున్న ఆమెకి కాస్త సహాయపడడం తమ హోదాకి తక్కువగా భావిస్తారు. అదే ఒక పెద్ద ఆఫీసరు తన భార్యకి సహాయం చెయ్యడం గొప్పగా అనుకుంటాడు, చేస్తాడు! మరీ కింది వర్గాలు కూడా ఆ సమానత్వాన్ని అమలుపరుస్తారు. 'ఏమేవ్! అని పిలవడం, భర్తగా తన హోదాని నిలబెట్టుకోవాలని పాకులాడడం, ఇదంతా కూడా నన్నడిగితే

'మధ్యతరగతి కాంప్లెక్స్' అనే అంటాను. ఎందుకంటే ఈ రకమైన కాంప్లెక్స్ ఒక్క మధ్యతరగతి వారికే వుంటుంది కాబట్టి!

"కరక్ట్! వున్నా లేకపోయినా అప్పుచేసి ఖర్చుపెట్టి, గొప్పలు చెప్పుకోవడం, వగైరాలన్నీ వీళ్లకే వుంటాయి!" నవ్వింది దీప్తి!

"ఈ మధ్యతరగతి వారు ఎప్పుడూ ఎవరితోటీ, మనసువిప్పి హాయిగా మాట్లాడలేరు. ఎందుకంటే ఎంతసేపూ వీళ్ల ఆలోచనలు లేనిదాన్ని ఉన్నట్టుగా చెప్పడం ఎలాగా అనే ఆలోచిస్తూ వుంటుంది" అంది బబిత.

"నువ్వు సైకాలజీ తీసుకుని స్పెషలైజ్ చెయ్యాల్సిందే! బలే బాగా ఆలోచించావ్! కరెక్టుగా చెప్పావ్! దేశంలో ముప్పాతిక జనాభా మధ్యతరగతి కుటుంబాలే! అందుకే ప్రగతి తొందరగా సాధ్యంకాదు. మార్పుని తొందరగా అంగీకరించలేరు. స్వీకరించలేరు" అంది దీప్తి.

బబిత గడియారం చూసుకుంది. గంటకుపైగా వాళ్ల చర్చ! కాంప్లెక్స్‌లమీదా, మధ్యతరగతి మనుష్యులమీదా జరిగిందని గ్రహించి, టాపిక్ మార్చుకున్నారు.

మరి కాస్సేపు కూర్చుని బయలుదేరుతున్న బబితని 'జాగ్రత్తగా వెళ్లు!' అంటూ హెచ్చరించింది దీప్తి! నవ్వుతూ కారు స్టార్ట్‌చేసింది బబిత! ఫింగర్స్ క్రాస్ చేసి భగవంతుణ్ణి తలచుకుంటూ!

★